క్లుప్తంగా

ఉపాధ్యాయుల గొంతుకనవుతా..



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

సిద్దిపేటకమాన్: తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్ కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను పోటీలో ఉన్నానన్నారు. ఉపాధ్యాయుల, అధ్యాపకుల సంక్షేమం కోసం పనిచేస్తానని, ఉపాధ్యాయుల గొంతుకనవుతానని అన్నారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి టీచర్ల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న టీచర్లు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అందె ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న పేద విద్యార్థిని ఫకీర్‌గల్ల కావ్య తండ్రి రాములు ఇటీవల చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు శుక్రవారం విద్యార్థినిని పరామర్శించి ఓదార్చారు. రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించి చేయూతనిచ్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పట్టాభూములుగా మార్చొద్దు



ఫిర్యాదు చేస్తున్న సదన్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: మండలం పోతారం(ఎస్)లోని సర్వే నంబరు 98లో 9ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ధరణిలో భూస్వాములకు అసైన్డ్ పట్టా ఇచ్చారని, దీనిని ఇప్పుడు పట్టా భూమిగా మార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదన్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఈ భూమి విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. భూస్వాములు, రిటైర్డు ఉద్యోగులకు ఇచ్చిన అసైన్డ్ పట్టాను రద్దుచేసి పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇప్పించాలని కోరారు. వారి వెంట ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు డీబీఎఫ్ నేతల పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న శంకర్

గజ్వేల్: రైతు బీమా తరహాలో కూలీలకు సైతం బీమా వర్తింపజేయాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని గిరిపల్లిలో అప్పులు బాధతో ఆత్మహత్య చేసుకున్న తండ్రీ కొడుకులు బండారు మల్లయ్య, రవీందర్ కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలకు బీమా పథకం లేకపోవడం వల్ల ఎన్నో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మృతుల భార్యలకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని, వారి పిల్లల ఉన్నత చదువుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి ఉన్నారు.

ఘనంగా తల్లిదండ్రుల పూజా దినోత్సవం



పాద పూజలు చేస్తున్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక మోడల్ స్కూల్‌లో తల్లిదండ్రుల పూజా దినోత్సవాన్ని శుక్రవారం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. తమ తల్లిదండ్రులకు పూల మాలలు వేసి, పాద పూజలు చేశారు. దీంతో తల్లిదండ్రులు ఆనందంతో భాగోద్వేగాలకు గురయ్యారు. ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శినిని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కొత్తిమీర సాగు.. లాభాలు బాగు

ప్రతి ఇంటిలో వంట తప్పనిసరి. సంపన్నుల దగ్గర నుంచి గరీబులు వరకు సంతృప్తిగా తినాలనుకుంటారు. వారు వండుకొనే కూరలకు అదనపు రుచి రావాలంటే కొత్తిమీర పడాల్సిందే. అందుకే దానికి ఏ సీజన్‌లోనైనా మంచి డిమాండ్ ఉంటుంది. తక్కువ పెట్టుబడితో యువ రైతులు ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. నెలన్నర వ్యవధిలో పంట కూడా చేతికి అందుతుంది.

- ముమ్మరంగా సాగుచేస్తున్న తండావాసులు
- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- విత్తిన నెల రోజుల్లోనే పంట చేతికి..
- ఆ ఊళ్లో 55 శాతం ఇదే సాగు
- కరీంనగర్, హుస్నాబాద్ మార్కెట్‌లో విక్రయం



మల్‌చెర్వుతండాలో సాగుచేసిన కొత్తిమీర పంట

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా, మల్‌చెర్వుతండా, ధర్మారం, పోతారం(జే) గ్రామాలతో పాటు వాటి పరిధిలోని తుర్కవానికుంట, కేశనాయక్‌తండా, రాగ్యటోనిపల్లిలో సుమారుగా 55 శాతం మంది కొత్తిమీర పంటే సాగు చేస్తున్నారు. మసిరెడ్డితండా, మల్‌చెర్వుతండా గ్రామాల్లో సుమారు 20 నుంచి 35 మంది యువరైతులు ఈ సాగుపై మక్కువ చూపుతూ పరిసర గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల సాగుతో పాటు కొత్తిమీర పంటను సాగుచేస్తున్నారు. ఐదు గుంటల నుంచి 30 గుంటల్లో.. ఒక్కొక్కరు తమ వీలును బట్టి సాగు చేపట్టారు.

రూ.20 నుంచి రూ.30 వేలు పెట్టుబడి

ఎకరా సాగు పెట్టుబడి సుమారు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు అవుతోంది. ప్రస్తుతం సాగు చేసిన వారిలో కొన్ని చోట్ల పంటు మొలక దశలో ఉంది. మరి కొన్నచోట్ల ఏపుగా పెరిగింది. ఈ కొత్తిమీరను కరీంనగర్, హుస్నాబాద్ మార్కెట్లలో విక్రయించి అధిక లాభాలు గడిస్తున్నారు.

రవాణా సౌకర్యం లేదు

లాభాలు బాగానే వస్తున్నా.. కొత్తిమీరను మార్కెట్లకు తరలించేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని రైతులు వాపోతున్నారు. ఉదయం 9 గంటల తర్వాత బస్సు ఉండడంతో కొత్తిమీరను మార్కెట్‌కు తరలించేందుకు ప్రైవేట్ ఆటోల్లో తరలించాల్సి వస్తోంది. దీంతో చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని యువ రైతులు అంటున్నారు. తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పిస్తే కరీంనగర్ లాంటి మార్కెట్లకు తరలించగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అధిక లాభాలు వస్తున్నాయ్



ఇతర పంటలతో పోలిస్తే కొత్తిమీర పంటకు అయ్యే ఖర్చు చాలా తక్కువ. అన్ని సీజన్లలో కొత్తిమీరకు మంచి డిమాండ్ ఉంటుంది. పంట చేతికొచ్చాక రోజూ రూ.1500 వరకు ఆదాయం వస్తుంది. ఖర్చులు పోను నెలకు రూ.30 వేలు మిగులుతుంది. అందుకనే 30 గుంటల్లో కొత్తిమీర సాగుచేస్తున్నా. ఉదయం ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం.

– మాలోతు జగన్‌నాయక్, యువరైతు, మసిరెడ్డితండా

రిజర్వాయర్లు నింపి సాగునీరందించాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల(సిద్దిపేట): దేవాదుల ప్రాజెక్టులో భాగంగా గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయిన గూడెం, వెల్దండ, లద్నూర్, తపాసుపల్లి రిజర్వాయర్లను నింపి జనగామ నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నీళ్లకోసం రైతులు అల్లాడుతున్నా అధికారులు, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళితే చర్యలు తీసుకోకపోగా పంపులను బంద్ చేయడం విడ్డూరమని వాపోయారు. వెంటనే రిజర్వాయర్లు, చెరువులను నింపి పంటలను కాపాడాలని, లేకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ప్రారంభం

బీసీ ఐక్యవేదిక నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించి, చట్ట బద్ధ ప్రక్రియను ప్రారంభించిందని బీసీ ఐక్యవేదిక నాయకుడు వీరన్నయాదవ్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల చట్టబద్ధత ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ కృషికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంపే బిల్లుకు కేంద్రం ఆమోదం తెలిపి ఓబీసీలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ శివయ్య, అనిల్‌గౌడ్, అయిలయ్య, పరశురాంగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే



విజేతలతో ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇంగ్లిష్ అంటే భయం వద్దని, ఇష్టంగా నేర్చుకోవాలని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోహర్ విద్యార్థులకు సూచించారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్, స్పెల్లింగ్ టెస్ట్, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మాతృభాషతో పాటుగా అంతర్జాతీయ భాషను నేర్చుకోడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉదయశ్రీ, ప్రభ, శ్రీనివాస్ గౌడ్, పద్మలత, సుజాత, అశోక్ రెడ్డి, మల్లయ్య, సిద్దేశ్వర్, వెంకట నరసింహారెడ్డి, ఉజ్వల, పద్మ, కౌసర్ సుల్తానా, సరస్వతి, బాలలక్ష్మి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలతోనే అభివృద్ధి సాధ్యం

పీఆర్టీయూ జిల్లా నేత ఇంద్రసేనారెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళలు చదువు, ఉద్యోగం, ఇంటి పనులే కాకుండా రాజకీయంగా కూడా రాణించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ భవన్‌లో మహిళా ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన వంగ కవిత, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మహిళలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఉపాధ్యాయరంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో మహేందర్‌రెడ్డి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజయ, సుజాత, రమా దేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం నుంచి గోటి తలంబ్రాలకు వడ్లు



వడ్లను అందజేస్తున్న భద్రాచలం ఏఈఓ

గజ్వేల్‌రూరల్: భద్రాచలం సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే గోటి తలంబ్రాలను సిద్ధం చేసేందుకు ఆ దేవస్థానం నుంచి వడ్లను శుక్రవారం స్థానిక రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే గోటి తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమంలో రెండేళ్లుగా ఈ ప్రాంత భక్తులు భాగస్వాములవుతున్నారన్నారు. ఈ యేడు కూడా ఈ కార్యక్రమంలో అవకాశం లభించడం సంతోషంగా ఉందని చెప్పారు. భద్రాచల ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్ 250 కిలోల వడ్లను అందజేశారని తెలిపారు.

అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవు



రికార్డులను పరిశీలిస్తున్న మల్లయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ కంటే అధికరేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని దుబ్బాక వ్యవసాయ సంచాలకుడు కె.మల్లయ్య ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని పలు దుకాణాలలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, లైసెన్సులను పరిశీలించారు. నకిలీ మందులు, విత్తనాలను విక్రయిస్తే దుకాణాలను సీజ్‌చేసి లైసెన్సులను రద్దు చేస్తామని చెప్పారు. ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు బిల్లు రసీదులను తప్పకుండా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలపై సూపర్‌వైజర్ వేధింపులు

చర్యలు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్



మాట్లాడుతున్న భాస్కర్

తొగుట(దుబ్బాక): అంగన్‌వాడీ కార్యకర్తలను, హెల్పర్లను వేధింపులకు గురిచేస్తున్న సూపర్‌వైజర్ అముతుల్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను తూచే మిషన్‌పై దుమ్ము పడిందంటూ హెల్పర్‌గా పనిచేస్తున్న లక్ష్మికి మెమో జారీ చేయడం విచిత్రంగా ఉందన్నారు. అంతేగాకుండా ఆమె ఫోన్‌ను బలవంతంగా లాక్కుని రోజూ ఎవరితో మాట్లాడుతున్నామంటూ బెదిరించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. హెల్పర్ ఫోన్ లాక్కుని వ్యక్తిగత స్వేచ్ఛను హరిచడంతగదని, అకారణంగా కార్యకర్తలు, హెల్పర్‌లను వేధించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సూపర్‌వైజర్ భర్తతో కార్యకర్తలను బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. గతంలో కూడా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను అనేక రకాలు వేధింపులకు గురిచేశారని వాపోయారు. లక్ష్మికి ఇచ్చిన మెమోనూ వెంటనే వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, సతీశ్ పాల్గొన్నారు.

రైల్వేలైన్ పనులు అడ్డుకున్న రైతులు

నష్ట పరిహారం చెల్లించాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): తమకు నష్ట పరిహారం చెల్లించాకనే రైల్వేలైన్ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని గంగాపూర్ రైతులు శుక్రవారం పనులు అడ్డుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో తమ పట్టా భూములు కోల్పోయామని, ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని వాపోయారు. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగి వేసారి పోతున్నామని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలకృష్ణ అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా సమస్య వివరించారు. కలెక్టర్‌కు వివరించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ధర్నాలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నంగునూరు(సిద్దిపేట): సీతారామచంద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం అవుతున్నాయి. ప్రతియేటా మాఘ బహుళ పంచమి పురస్కరించుకొని ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. శనివారం ఉదయం 7 గంటలకు నగర సంకీర్తనం, అలాగే ఆదివారం శకటోత్సవం, బండ్లు తిరుగుట, ఒగ్గు కథ లాంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. సోమవారం సామూహిక కుంకుమార్చన, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రమేశ్‌గౌడ్ శుక్రవారం తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న కరుణాకర్ తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని శభాష్ గూడేనికి చెందిన పలువురికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరం లాంటిదన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి లబ్ధిదారుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, పర్వతాలు యాదవ్, యాదగిరి, దాసు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



నంగునూరు(సిద్దిపేట): ఉపాధ్యాయులతో విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): స్వపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బద్దిపడగ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. డీఈఓగా సిద్ధాంత్, ఎంఈఓగా ఈశ్వర్, హెచ్‌ఎంగా శ్రీనిత, ఉపాధ్యాయులుగా గౌతం, రమ్య, హాసిని, రామ్‌చరణ్, వరుణ్ వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్‌ఎం ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, చంద్రకాంత్, మంగ, రవళి బహుమతులు అందజేశారు.

కాసులాబాద్‌లో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓగా ఆర్.నవతేజ్, ఎంఈఓగా టి.నందీశ్వర్, హెచ్‌ఎంగా పి.హర్షిత్ విధులు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి హెచ్‌ఎం విఠల్, టీచర్లు సురేశ్, కృష్ణ మూర్తి, శివకుమార్, విద్యాప్రకాశ్, రామచంద్రం, వినోదలు బహుమతులు ప్రదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ బాధ్యులను శిక్షించాలంటూ ధర్నా

కొండపాక(గజ్వేల్): పంచాయతీ సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బందిపై దాడిచేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో బాలనర్సయ్య, కొమురయ్య, ప్రభాకర్, శ్రీనివాస్, నర్సింహులు, లచ్చవ్వ, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములుకండి

గజ్వేల్‌రూరల్: సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించి మున్సిపాలిటీని ఆదర్శంగా నిలపడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు.

◆ సకాలంలో పూర్తి చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట): మండల కేంద్రంలో నూతనంగా చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ దామోదర్‌రావు ఆదేశించారు. శుక్రవారం ఆయన మోడల్ హౌస్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కూటిగల్, ధర్మారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభిస్తామన్నారు. ఎంపీడీఓ రామ్మోహన్, అనిత, అశోక్ పాల్గొన్నారు.

◆ అపరిచితులతో అప్రమత్తం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, వారు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని సీఐ సైదా సూచించారు. పట్టణంలోని జీడీఆర్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, షీటీమ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు చాలా ఉపయోగపడతాయని, వాటి ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ విజయ్‌భాస్కర్ కోరారు. మోత్కులపల్లి గ్రామాన్ని శుక్రవారం సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి సహకరించాలన్నారు.

◆ మోడల్ హౌజ్ నిర్మాణ పనులు ప్రారంభం

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక పోలీస్‌స్టేషన్ వెనక భాగం, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వెనకాల ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ భానోతు జయరాం మాట్లాడుతూ ఇళ్లను 400 చదరపు అడుగల్లో.. రూ.5లక్షలతోనే పూర్తి చేస్తారన్నారు. అలాగే కుందనవానిపల్లిలో సుమారు 50 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు చెప్పారు.

◆ పది అష్టావధానం, సాహిత్య కార్యక్రమాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హరిహర రెసిడెన్సీ కాలనీ ఆవరణలోని లలిత చంద్రమౌళీశ్వర దేవాలయ మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం అష్టావధాని మారెపల్లి పట్వర్ధన్ శతావధానితో పది అష్టావధానాలు, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు పండరి రాధాకృష్ణ, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం శుక్రవారం తెలిపారు. కవులు, రచయితలు, సాహితీ ప్రియులు, భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కమార్‌గౌడ్‌ను శుక్రవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ ఇమ్రాన్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తోందని వివరించారు.

వీరుడా.. వందనం



గజ్వేల్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బజరంగ్‌దళ్ సభ్యులు

పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు వివిధ పార్టీల నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. బజరంగ్‌దళ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు వేరువేరుగా కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. దేశ రక్షణలో సైనికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని వక్తలు కొనియాడారు.



కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్ నాయకుల నివాళి



చిన్నకోడూరులో బీఆర్ఎస్ నాయకులు..